
# లోకం పోకడ



మహాభాష్యం నరసింహారావు

శ్రీవారిని అప్పుడే ఆఫీసుకి పంపించి, ఇల్లు ఊడుద్దామని చీపురు పట్టుకొనే సరికి ఇంటిముందు ఆటో ఆగింది.

"ఈ టైమప్పుడు ఎవరొచ్చేరబ్బా!" అనుకుంటూ బయటకు వెళ్ళి చూసేసరికి సంచి పట్టుకుని ఆటోలో నుండి మా చెల్లి పద్మ దిగింది.

నేను ఆశ్చర్యంగా దాన్ని చూస్తూ, 'ఏమిటి చెప్పా చెయ్యకుండా ఇలా ఊడిపడ్డావు? కాకినాడ నుండేనా రావడం?!' అంటూ కుశల ప్రశ్నలు వేసి మంచినీళ్ళు అందించాను.

పద్మ మంచినీళ్ళు త్రాగి గ్లాసు పక్కనపెట్టి, 'అక్కా, మన లక్ష్మికి మంచి పెళ్ళి సంబంధం వుంది. ఆ విషయం చెప్దామనే ఇలా పరుగెత్తుకు వచ్చాను' అంది.

నేను నవ్వుతూ 'ఉత్తరం రాయవచ్చు కదా! ఇంత హడావుడి ఎందుకు?' అన్నాను.

'అక్కా చాలా మంచి సంబంధం. వాళ్ళకి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. వాళ్ళ పెద్దబ్బాయి ఇంజనీరింగు చదివి, ఎలక్ట్రిసిటీ బోర్డులో ఉద్యోగం చేస్తున్నాడు. రెండవ అబ్బాయి ఇంజనీరింగు చదువుతున్నాడు. వాళ్ళమ్మాయిలు ఇంటర్‌మీడియెట్, టెన్త్ క్లాసు చదువుతున్నారు. తండ్రికి బేంకులో ఉద్యోగం. అబ్బాయి కూడా చక్కగా వుంటాడు. మన లక్ష్మికి అన్ని విధాల అనుకూలమైన సంబంధం!' అంటూ మాటల పోగైన మా చెల్లి పద్మ నాన్‌స్టాపుగా గబగబా చెప్పి, వచ్చిన పని అయిపోయినట్లు నా ముఖం చూసింది.

నేను మాట్లాడకుండా ఆలోచించడం చూసి, 'ఏమిటక్కా, ఆలోచిస్తున్నావు? ఈ సంబంధం గురించి వినగానే నువ్వు ఎగిరి గంతేస్తావనుకుని వచ్చాను. అబ్బాయి ఇంజనీరు అవ్వడం వలన చాలా మంది ఎగరేసుకు పోవడానికి రెడీగా ఉన్నారు' అంటూ నా ముఖంలోకి చూసింది.

నేను నవ్వి, 'పిచ్చిపిల్లా! ఎంతో అభిమానంతో అంత దూరం నుండి మా అమ్మాయికి సంబంధం చెప్పడానికి వచ్చావు. నాకు సంతోషంగా వుంది. ఇంకా మేము దాని పెళ్ళి గురించి ఆలోచించలేదు. దానికి తోడు అబ్బాయి ఇంటికి పెద్దవాడంటున్నావు. ఇంటికి పెద్ద కోడలునై నేనెంత సుఖపడ్డానో నీకు తెలుసు కదా! మరలా అన్నీ తెలిసిన మా అమ్మాయిని మరొక ఇంటికి పెద్ద కోడలుగా పంపమంటావా?! దానికి తోడు అబ్బాయి వయస్సు ఇరవై తొమ్మిది అంటున్నావు. మన లక్ష్మి బి.యస్సీ చదివింది కానీ దాని వయస్సు ఇంకా ఇరవై కూడా నిండలేదు. అంత వయసు తేడాతో ఇవ్వడం ఇష్టం లేదు. వయసు తేడా ఐదేళ్ళ లోపు ఉంటే బాగుంటుంది'

అన్నాను.

మా పద్మ నవ్వి, 'నీకూ బావకి పదకొండేళ్ళు తేడా కదా! అయినా మీ ఇద్దరికీ ఏం తక్కువయింది? నిజం చెప్పాలంటే నీ కన్నా బావే హుషారుగా కనిపిస్తున్నారు. నీకు ముగ్గురూ ఆడపిల్లలే కాబట్టి బాగా ఆలోచించు. పిల్ల నచ్చితే వాళ్ళు కట్నం కూడా ఎక్కువ అడగకపోవచ్చు. అబ్బాయి తల్లి, తండ్రి మాకు బాగా తెలుసు. చాలా మంచి వాళ్ళు. తరువాత మీ ఇష్టం!' అంది గట్టిగా నిట్టూరుస్తూ.

'ఇప్పుడే కదా చెప్పావు. మీ బావగారు ఆఫీసు నుండి వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుకుందాం. ఇక భోజనం చేద్దామా!' అని మాట మార్చాను.

పద్మ చిన్నబుచ్చుకుని అయితే బట్టలు మార్చుకుని వస్తానని లోనికి వెళ్ళింది.

భోజనాలయ్యాక పద్మ, నేను మంచంపై వాలి చిన్ననాటి కబుర్లు చెప్పుకున్నాం. ప్రయాణం చేయడం వలన అలసిపోయినట్లుంది. పద్మ వెంటనే నిద్రలోకి జారుకుంది.

నేను ఎంత ఇటూ అటు దొర్లినా నాకు నిద్ర రాలేదు. మనసు మెల్లగా గతంలోకి పరుగెత్తింది.

✳ ✳ ✳

అప్పుడు నా వయసు పద్దెనిమిది. టెన్తు క్లాసు ప్యాసయి ఇంట్లో కూర్చున్నాను. మా బాబాయి చెప్పాడని మా నాన్నగారు ముందూ వెనక ఆలోచించకుండా నారాయణ మూర్తి గారితో నా పెళ్ళి జరిపించారు.

మా అత్తగారు రుక్మిణమ్మ, మామగార్లు కృష్ణమూర్తి గారు ఇద్దరూ పెద్ద కోడలుగా నన్ను వారింటికి హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ముగ్గురు మరుదులు మౌళి, శ్రీకాంత్, అనంత్, ఆడపడుచులు వల్లి, శ్రీలత కూడా నన్ను 'వదినా' అంటూ ఆప్యాయంగా పిలుస్తూ చుట్టూ తిరిగేవారు.

నా పెళ్ళికి నా మరుదులు ఇద్దరూ కాలేజీలోనూ, ఒక మరిది, ఇద్దరు ఆడపడుచులు హైస్కూల్లోనూ చదువుతూ వుండేవారు. మా వారికి రాజమండ్రిలో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం అవడం వలన మేమిద్దరం రాజమండ్రిలో వుంటూ వుండేవాళ్ళం. మా మామయ్యగారు ఉద్యోగరీత్యా విజయనగరంలో వుంటూ వుండేవారు.

నా పెళ్ళయ్యేక మా పెద్ద మరిది ఇంజనీరింగ్‌లో సీటు రావడం, రెండవ మరిదికి

## అవును

అన్యాయార్జిత వైభోగం
ఒక 'వాపు'!
మదిని సలుపుతుంది
ఎల్లప్పుడూ!
తదాదిగా ప్రతి సెకనూ
మానసిక వత్తిడి పెత్తనానికి
లొంగిపోయి స్థిమితం లేని
బతుకు బతికేకంటే
న్యాయ సంపాదన 'బలుపు'తో లేదా
దరిద్రంతో నైనా
జీవించడం మేలు!

**- మాధవరపు కృష్ణ**

మెడిసిన్‌లో సీటు రావడంతో మా అత్తగారు మురిసిపోయి, 'కోడలు ఇంటికి వచ్చిన వేళా విశేషం' అంటూ నన్ను ఎంతో గౌరవంగా అభిమానంగా చూసేవారు.

మా ఆడపడుచులిద్దరికీ మా అత్తగారు నన్ను పొగుడుతూ వుంటే సహించలేక పోయేవారు. "ఇప్పటి నుండి అలా చూస్తే ఆవిడ నెత్తికెక్కి కూర్చుంటుంది. జాగ్రత్తగా వుండమ్మా!" అంటూ మా పెద్ద ఆడపడుచు వల్లి పెద్ద ఆరిందలా వాళ్ళమ్మగార్ని హెచ్చరించింది.

మా మరుదులు ముగ్గురూ మాత్రం ఎంతో అభిమానంగా మాట్లాడి వారికన్నా వయసులో చిన్నదానినైనా వదినెగా నన్ను ఎంతో గౌరవించేవారు.

ముగ్గురు పిల్లలు ఒక్కసారి కాలేజీ చదువుకు రావడంతో మామగారి గుమాస్తాగిరి సంపాదన చాలక పెద్ద కుటుంబం అవడం వలన ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

మొదటి నుండి మా వారిది చాలా జాలి గల మనసు. దానికి తోడు వాళ్ళన్నదమ్ములన్నా, అప్పచెల్లెళ్ళన్నా అమితమైన ప్రేమ. వారికి ప్రాణం పెట్టేవారు. అలాగే వాళ్ళమ్మ నాన్నగార్లను కూడా అమితంగా ప్రేమిస్తూ, భక్తి, గౌరవాలతో చూసేవారు.

వారి (మా) కుటుంబం చూసి నేను ముచ్చటపడి సరదాగా వాళ్ళతో కలిసి పోయేను. 'నేను శ్రీరామచంద్రుడ్ని, మా తమ్ముళ్ళు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు, నువ్వు సీతమ్మవి. నా తమ్ముళ్ళు నా మాట జవదాటరని' అంటూ ఎంతో గర్వంగా మురిసిపోయేవారు.

మావారు విశాఖపట్నంలో చదువుతున్న ఇద్దరు తమ్ముళ్ళకి కావలసిన డబ్బు పంపించి వారికి చదువు చెప్పించేవారు. మిగతా సగ భాగం అంటే అప్పట్లో వెయ్యి రూపాయలతో మా యిల్లు గడుపుకోవలసి వచ్చేది. గుట్టుగా రెండో కంటికి తెలియకుండా ఉన్న డబ్బుతో కోరికలను అదుపులో పెట్టుకుని కాలక్షేపం చేసేవాళ్ళం.

మేము పొదుపుచేసి గుట్టుగా కాపురం చేసుకుంటూ వుంటే కొందరు మమ్మల్ని పిసినారివారని, కక్కుర్తివాళ్ళని ఎగతాళి చేసేవారు. ఎవరో ఏదో అంటే బాధ వుండేది కాదు కానీ అన్నీ తెలిసిన స్వంత ఆడపడుచులు ఇంటికి వచ్చినప్పుడల్లా వారికి ఖరీదైన బట్టలు కొనలేదని, వారిని సినిమాలకు తిప్పలేదని అన్నప్పుడు బాధ కలిగింది.

ఏ పండగలొచ్చినా, శ్రావణ మాసం వచ్చినా అత్తవారింటికి రమ్మనమని పిలిచేవారు. పుట్టింటికి వెళ్ళి నాలుగు రోజులుండి రావాలని కోరిక వున్నా వీలు పడేది కాదు.

పెళ్ళయిన ఆరేళ్ళలో ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. పురిటికి వెళ్ళినపుడు పుట్టింట్లో మూడు నెలలు వుండడమే ఎంతో గగనంగా ఉండేది. మామూలు రోజులలోనూ, పండగ రోజులలోనూ అత్తయ్యగారు, మరుదులు చూపించే ఆత్మీయత, అభిమానంతో పుట్టింటికి వెళ్ళాలనే కోరికను మనసులోనే అణచుకొనేదాన్ని.

నా భర్త నారాయణమూర్తి చూపే ప్రేమానురాగాలు, అభిమానంతో మా ఆడపడుచులు నన్ను ఈసడించుకున్నా భరిస్తూ ఇంట్లో నవ్వుతూ వుండేదాన్ని.

మరుదులు ఇద్దరి చదువులు పూర్తయి ఉద్యోగంలో చేరడంతో ఊపిరి పీల్చుకుని 'అమ్మయ్య! ఇక కష్టాలు గట్టెక్కాయని' అనుకునే సరికల్లా పెద్ద ఆడపడుచు వల్లి పెళ్ళి కుదిరింది.

ఆమెకు పెళ్ళిచేసి, రెండు పురుళ్ళు పోసి పంపించేసరికి రెండవ ఆడపడుచు శ్రీలతకి పెళ్ళి కుదిరింది. ఆమె పెళ్ళి చేసి అత్తగారింటికి పంపించేసరికి మాకు నీరసం వచ్చింది.

కష్టపడి ఆడపడుచుల పెళ్ళిళ్ళు దగ్గరుండి చేయించి, పురుళ్ళకి సాయంచేసి అన్ని సేవలు చేసి అచ్చట్లు ముచ్చట్లు తీరిస్తే ఈ రోజు నోరారా 'ఒదినా' అని పిలవడానికి ఇద్దరాడపడుచులు బాధపడేవారు.

మరుదులిద్దరూ డాక్టరు, ఇంజనీరు అవడం వలన పెద్ద సంబంధాలు వచ్చి, ఇద్దరికి పెళ్ళిళ్ళు జరిగాయి. తోటికోడళ్ళిద్దరూ బాగా కలవారి

పిల్లలవడం వలన. బాగా చదువుకున్న పిల్లలవడం వలన తోటి కోడళ్ళు అత్తవారింటికి వచ్చినా తనకి మాత్రం వంటడ్యూటీ, ఇంటి పనులు తప్పేవి కావు.

తరువాత మూడవ మరిది అనంత్‌కి కూడా బ్యాంక్‌లో ఉద్యోగం రావడంతో అతనికి పెళ్ళిచేసి పంపించారు.

ఇంటికి పెద్ద కోడలుగా వెళ్ళినందుకు మరుదులు, ఆడపడుచులు అందరి పెళ్ళిళ్ళు జరిగి అంతా హాయిగా ఉన్నందుకు మెల్లగా ఊపిరి పీల్చుకునేసరికి తన పిల్లలు కాలేజీ చదువులకొచ్చి ఎదిగి కూర్చున్నారు.

పిల్లలకు కనీసం గ్రాడ్యుయేషన్ అయినా పూర్తయ్యేవరకు పెళ్ళిళ్ళు చేయకూడదని నిర్ణయించుకుని వారిని చదివిస్తోంది.

* * *

కాలచక్రం గిర్రున ఐదేళ్ళు తిరిగింది. ఇంట్లో చాలా మార్పు వచ్చింది. మరుదుల పెళ్ళిళ్ళు అయ్యాక పూర్తిగా మారిపోయారు. పూర్వపు అభిమానాలు, ఆప్యాయతలు ఇప్పుడు లేవు. కలిసినప్పుడల్లా వాళ్ళ పెళ్ళాల గొప్పలు, పిల్లల గొప్పలు వారు చెప్తూ వుంటే వినడానికే టైము సరిపోయేది. వాళ్ళు ఉద్యోగాలలో చేరి పది సంవత్సరాలు పూర్తికాకుండానే అప్పుడే హైద్రాబాదులో ఒకరు, విశాఖపట్నంలో ఒకరు అపార్టుమెంట్లు కొనుక్కున్నారు.

మూడవ మరిది ఉద్యోగం బ్యాంకులో అవడం వలన అతనూ ఇల్లు కొనుక్కునే ప్రయత్నంలో ఉన్నాడు.

మామగారు రిటైరయ్యాక విజయనగరంలోనే వున్న స్వంత ఇంట్లోనే ఉంటూ, అప్పుడప్పుడు కొడుకుల దగ్గరికి వెళ్ళి కొన్నాళ్ళు వుండి వస్తున్నారు.

అత్తగారికి నేనన్నా, మా వారన్నా, పిల్లలన్నా అమితమైన ప్రేమ, అభిమానం, జాలి. చిన్నవాళ్ళు అప్పుడే ఇళ్ళు కొనుక్కుంటూ వుంటే, పెద్దవాడిగా ఇల్లు-వాకిలీ లేదని బాధపడేవారు. ఆమె ఆశీస్సులుంటే చాలని, అవే పదివేలని అనుకుంటూ మామగారు పాత ఇల్లయినా మాకు ఇవ్వకుండా వుంటారా! అని ఆలోచిస్తూ పక్కకి తిరిగి చూసేసరికి పక్కలో పద్మ కనిపించలేదు.

ఆత్రుతగా లేచి పక్కగదిలోకి వెళ్ళి చూసేసరికి కూతురు లక్ష్మితో పద్మ కబుర్లు చెప్తూ కనిపించింది.

'ఏం అప్పుడే నిద్ర లేచావు. ఇంకా రెండు గంటలే కదా అయింది' అని అడిగాను.

పద్మ నవ్వి, 'నువ్వు హాయిగా నిద్రపోతున్నావు. నాకు మెలకువ వచ్చి చాలాసేపు దిక్కులు చూసి లేచి ఇటు వచ్చాను' అంది.

'నా ముఖం! నేను నిద్ర ఎక్కడ పోయాను? ఏదో ఆలోచిస్తూ దొర్లుతున్నాను' అన్నాను. 'అయితే ఈ సంబంధం ఇష్టమేనా?' అని మరలా పద్మ అడిగింది.

నేను నవ్వి, "పెళ్ళిళ్ళ పేరయ్య లాగున్నావే. అయినా నా ఉద్దేశ్యంలో ఈడూ-జోడూ బాగుంటే వారి సంసారాలు బాగుంటాయి. ఇద్దరికీ వయసు తేడా ఎక్కువ వుంటే ఇద్దరి ఆలోచనలు ఒక రకంగా వుండక సంసారపు బండి ఒడిదుడుకులతో మా సంసారంలా నడుస్తుంది. నా పిల్లలకు గొప్ప సంబంధాలు చేయలేకపోయినా, వయసు తక్కువ తేడా ఉన్నవారికే ఇచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నాను. మా అమ్మాయిల్ని మాత్రం ఇంటికి పెద్ద కోడలుగా పంపదల్చుకోలేదు. మీ బావగారు వచ్చినా ఇదే విషయం చెప్పదల్చుకున్నాను' అని దృఢంగా చెప్పేసరికి మా అమ్మాయి లక్ష్మి, చెల్లి పద్మ కూడా ఒక్కసారి నిశ్చేష్టులై నా వంక వింతగా చూశారు.

పద్మ ముఖం చిన్నబుచ్చుకుని మరునాడు ఉదయమే కాకినాడ వెళ్ళిపోయింది.

* * *

తరువాత సంవత్సరానికి మా పెద్దమ్మాయి లక్ష్మికి నా కోరిక మేర నాలుగు సంవత్సరాల వయసు తేడా వుండి, బేంకులో ఉద్యోగం చేస్తున్న అబ్బాయి దొరకడంతో అతనితో పెళ్ళి నిశ్చయించాము.

వారు లక్ష రూపాయలు కట్నం అడగడం వలన, పెళ్ళి ఖర్చులకు సుమారు యాభై వేలు అవసరమని తేలడం వలన, 'అవసరానికి ఆదుకోలేకపోతారా' అని కొంత సొమ్ము తమ్ముళ్ళని అడగాలని నారాయణమూర్తి తమ్ముళ్ళ దగ్గరకి వెళ్ళాడు.

శ్రీకాంత్, మౌళి, అనంత్ కూడా కొత్తగా ఇళ్ళు కొనుక్కుని చిన్నచిన్న మార్పులు చేయడం వలన చాలా డబ్బులు ఖర్చయ్యాయి. ప్రస్తుతం ఏమీ సాయం చేయలేమని ముగ్గురూ ముక్తకంఠంతో 'సారీ అన్నయ్యా!' అన్నారు.

ముఖం పైసా అంత చేసుకుని వచ్చిన నారాయణమూర్తిని చూసిన శారద జరిగిన విషయం ఊహించింది. ఆమెలో ఉక్రోషం పొంగుకు వచ్చింది. 'మా తమ్ముళ్ళు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు. నేను శ్రీరామచంద్రుడ్ని అంటూ ఆనాడు కాలరు ఎగరవేశారు. ఆర్జించిన ధనమంతా పైసా దాచకుండా తమ్ముళ్ళ చదువులకు, పెళ్ళిళ్ళకు ఖర్చుచేశారు. 'ఇప్పటికైనా గ్రహించారనుకుంటూ లోకమంటే ఏమిటో! ఈ రోజుల్లో ఎవరూ ఏమీ చేయరండీ' అంటూ ఎత్తిపొడిచి పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక బావురుమని ఏడుస్తూ గదిలో మంచంపై వాలిపోయింది. నారాయణమూర్తి నిరుత్తరుడై దిక్కులు చూస్తూ లోకం పోకడ గురించి మొదటిసారి ఆలోచనలో పడ్డాడు.

*

